




# – 27 –

డియర్ రీడర్స్

డాక్టర్ చెప్పిన కథల్లో , కొన్ని సార్లు రోగులు, ఆస్పత్రి వాతావరణం కనిపించదు. క్షమించాలి."

చందు శైలజ

❦❦❦

**ఫైలు విసిరి కొట్టాడతను.**

ఛాంబర్లో అతని ఎదురుగా నిలబడ్డ ఉద్యోగులందరూ ఉలికి పడ్డారు. యజమానిలో అంత కోపం ఇదివరకెన్నడూ చూడలేదు.

పూర్ణిమ , అతని సెక్రటరీ ఒకడుగు వెనక్కి వేసింది.

టేబిల్ మీద పడ్డ ఫైల్ జారుకుంటూ వెళ్లి ఆమె కాళ్ళ వద్ద పడింది.

వంగి ఆ ఫైల్ తీసుకుని, మళ్ళీ టేబిల్ మీద పెట్టకుండా, రెండు చేతుల్తో జాగ్రత్తగా పట్టుకుని నిలబడింది.

"సరే, నేనే వెళ్తాను." అంటూ బయటికి నడిచాడు. అందరూ పక్కకు తొలిగి దారిచ్చారు. పూర్ణిమ ఫైల్ తో సహా పరుగు తీసింది అతని వేగాన్ని అందుకోలేక. ఫైల్, డ్రైవర్ పక్క సీట్లో పెట్టి దూరంగా నిలబడింది.

డ్రైవర్, సీట్లో కూర్చోబోతుంటే వారించాడు. తోడు వస్తామని చెప్పేందుకు ఎవరికీ ధైర్యం చాల్లేదు.

జీప్ స్టార్ట్ చేసి , ఏదో ఆలోచించి, పోర్టికో చివరి మెట్టుమీద నిలబడ్డ సెక్రటరీని దగ్గరకు రమ్మని పిలిచాడు.

పరుగున వెళ్ళి దగ్గరగా నిలబడింది. గ్లాస్ విండో దించి, "ఇవాళ రాత్రికి వచ్చేస్తాను. రేపు మీటింగ్స్ అవీ అనుకున్న టైం కే అరేంజ్ చెయ్యి" అని చెప్పాడు.

ఎన్నో ఏళ్ళ తర్వాత, సొంత ఊరికెళ్తున్నాడు. ఊళ్ళో జనాలకూ , అతనికీ, భూముల విషయంలో కొన్నాళ్లుగా వివాదం నడుస్తోంది. పరిష్కరించ డానికని, ఎన్నో సార్లు తన వద్ద పనిచేసే సమర్థులైన ఉద్యోగుల్ని పంపించాడు. ప్రతిసారీ , వెళ్ళివస్తున్నారు తప్ప సమస్య ఓ కొలిక్కి రాలేదు.

ఇవాళెలాగైనా ఈ విషయం తేల్చేసి రావాలన్నాడు. వెళ్ళడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఊరిజనాలతో నెగ్గలేకపోతున్నామని నిస్సహాయంగా వివరించబోయారు.

అతనికి కోపం వచ్చింది. తనే వెళ్ళి పరిష్కరించుకొస్తానని సిద్ధమయ్యాడు. సహాయకులు తోడు రావడానికి ప్రయత్నించారు. వద్దన్నాడు.

మధ్యాహ్నం ఎండగా ఉంది. తారోడ్డు మీద జీప్ దూసుకుపోతోంది. వాహనాలు తీసుకెళ్ళగలిగేది శరీరాలనే. అంతకంటే వేగంగా అతని ఆలోచనలు ప్రయాణిస్తున్నాయి.

అతనికి చిరాకుగా ఉంది. అనుకున్న టైం కు పని కాకపోతే అతనికిష్టం ఉండదు.

అతని ఊరు వెళ్ళాలంటే ఒక నదిని దాటాలి. ఆ తర్వాత కొంత దూరం, చిట్టడివి లాంటి ప్రదేశంలో ప్రయాణించాక గానీ ఊరు రాదు.

మనసులోనే లెక్క వేశాడు. నది దగ్గరకు వెళ్ళడానికి ఇంకో గంట పడుతుంది. బల్లకట్టు మీద జీప్ ఎక్కిస్తే సరి. దాని మీద ప్రయాణం ఒక పావుగంట. నది పక్కన దారి అక్కడినుండి ఊళ్ళోకి వెళ్ళడానికి ఇంకో పావుగంట.

అక్కడ ఊరిజనాలతో ఎంత సేపు పడుతుందో!

వాళ్లేమేమి అడ్డంకులు పెట్టగలరో, వాళ్ల వాదనలేమిటో కొంత ఊహించాడు. వాటికి సమాధానాలు మనసులోనే సిద్ధం చేసుకున్నాడు తన వాదనతో తను సంతృప్తిగా ఉన్నాడు. ఎదుటి మనిషికి మాట్లాడే అవకాశమే ఉండదు. అతని ఆట ఏస్ తో మొదలవుతుంది. స్మాష్ షాట్ తో ముగుస్తుంది.

డబ్బు వలన వచ్చే ఆనందం కన్నా ఎదుటివారిని ఓడించడంలో ఉండే ఆనందం అతనికిష్టం .

ఎలాగైనా సరే రాత్రికి సిటీకి వచ్చెయ్యాలి. రేపటి మీటింగ్స్ అన్నీ అనుకున్న ప్రకారమే జరగాలి.

మనసులో వేసుకున్న ప్లాన్ సంతృప్తికరంగా ఉండడంతో, అతనిలో చిరాకు తగ్గింది.

కొంత దూరం పోయాక , రోడ్డు మీద మనుషులు , మిగతా వాహనాలు కనిపించడం లేదు. పక్కనే పచ్చని కొండలు. మబ్బుపట్టి వర్షం పడుతుందేమోనన్నట్లు వెలుతురు తగ్గిపోయింది. ఏమిటా అని పైకి చూస్తే, ఆకాశం కనిపించడం లేదు. రెండు పక్కలా ఉన్న చెట్లు, రోడ్డు మీదకు వంగి, అవతలివేపున్న చెట్ల కొమ్మలతో కలుస్తున్నాయి. దారి పొడుగూతా ముదురాకుపచ్చని ఆకుల్తో పందిరేసినట్లుంది. 'కొమ్మలకూ , కొమ్మలకూ మధ్య స్నేహం ఎందుకూ? నిటారుగా పెరొగొచ్చు కదా' అనుకున్నాడు.

చిన్నతనంలో, ఇంత చల్లటి చెట్లు ఎప్పుడూ తను చూడలేదే. కాలేజికి సైకిల్ మీద వెళ్ళిన రోడ్డే అది. ఎన్నో మార్పులొచ్చాయి. రోడ్డు విశాలమైంది. చెట్లు అప్పుడు చిన్నవి. ఇప్పుడు పెద్దవయ్యాయి

పెద్దయ్యాక ఎన్నో దేశాలు తిరిగాడు కానీ, తన ఊరు వెళ్ళింది లేదు.

రైల్వే క్రాసింగ్ దగ్గర జీప్ ఆగాల్సి వచ్చింది. 'ఎంతకూ రాదే ట్రెయిన్!' అని చూస్తుండగా , ఒక చిన్న పిల్ల కారు విండో గ్లాస్ మీద చేత్తో కొడుతోంది. ఉడకబెట్టిన వేరు శనక్కాయలు చూపిస్తూ, తీసుకోమంటోంది. పెద్ద సైజు గౌను, వంటి మీద వేళాడుతోంది. రేగిన జుట్టు, మొక్కజొన్న పీచులా ఉంది .

చేతి సైగతో వద్దన్నాడు.

ఆ పిల్ల గ్లాస్ మీద కొట్టడం ఆపలేదు.

చేతి సంజ్ఞలతోనే కొనుక్కోండంటోంది.

కొంటే గానీ పోయేలా లేదని, జేబు చూసుకున్నాడు. తన దగ్గర డబ్బు ఉండదని గుర్తొచ్చింది. అవన్నీ తన వెంట ఉండే అసిస్టెంట్స్ చూసుకుంటారు.

జేబు తడుముకుని డబ్బులేదని తల అడ్డంగా ఊపాడు.

డాష్ బోర్డ్ చూడమని చేత్తో చూపించింది

తీసి చూస్తే ఏవో కాగితాలున్నాయి.

గ్లాస్ దించి,

"చిల్లర లేదు." అన్నాడు.

"వందకు చిల్లర కావాలా?" అని అతన్నడిగి, "ఒరేయ్, శీనుగా!" అని వెనక్కి తిరిగి కేకేసింది.

ఆ అమ్మాయి కన్నా కొద్దిగా పెద్ద పిల్లవాడొచ్చాడు.

"వందకు చిల్లరుందా?" అడిగింది.

వాడు లాగు జేబులో చెయ్యి పెట్టి , పదులు, ఇరవైలు తీసి చేతిలో ఉంచుకుని, నోటు ఇమ్మన్నట్టు అతని వంక చూశాడు.

" కాష్ లేదు." అమ్మాయితో చెప్పాడు.

"వంద లేదా?"

లేదన్నట్టు అడ్డంగా తలూపాడు.

అతని వంకా, జీప్ వంకా వింతగా చూసింది. ఆరోడ్డు మీద అలాంటి జీప్ ఇదివరకెన్నడూ చూడలేదు. బహుశా వెయ్యి, రెండు వేలు ఉండి ఉంటాయనుకుంది.

ఆ అమ్మాయి దృష్టి, జీప్ లో వేళాడుతున్న చిన్న విమానం బొమ్మ పడింది.

"కావాలా?" అడిగాడు.

అది ఊగుతూ ఉంటే, తనకెటూ చిరాకుగా ఉంది.

జవాబు చెప్పకుండా రాగిజుట్టు వెనక్కి తోసుకుని నవ్వింది.

దాన్ని తీసి ఇచ్చాడు. బదులుగా, రెండు పొట్లాల వేరు శనక్కాయలివ్వబోయింది. వద్దన్నాడు. అయినా సరే సీట్లో పెట్టేసి పరుగున వెళ్ళిపోయింది. ఆ విమానం తన స్నేహితులకు చూపిస్తోంది.

అతను నది దగ్గరకు వెళ్ళేసరికి బల్లకట్టు వెళ్ళబోతోంది. అతని జీప్ దానిమీదకెక్కించి కొద్ది దూరంలో నిలబడ్డాడు. బల్లకట్టు మీద మిగిలిన వాళ్ళు, ఎవరీ కొత్త మనిషి అని తమలో తామే అనుకున్నారు. అవతలి ఒడ్డుకెళ్లాక అందరూ బల్లకట్టు మనిషికి డబ్బిచ్చి దిగుతున్నారు.

జీప్ అవతలి ఒడ్డుకు చేరుకున్నాక "తిరిగి వెళ్ళేప్పుడు ఇస్తాను" అన్నాడు. బల్లకట్టు మనిషి అతని అతని జీప్, ఆహార్యం చూసి 'ఎటూ వెనక్కి వెళ్ళాలంటే తను తీసుకెళ్ళాల్సిందే.' అనుకుని మౌనంగా తల ఊపాడు.

ఊళ్లో అడుగు పెట్టాక , అతనింట్లోనే అందర్నీ సమావేశపరచాడు.

పేషంట్ తో అరగంట మాట్లాడి, వళ్ళంతా తడిమి తడిమి పరీక్ష చేసి, బ్లడ్ టెస్టుల రిజల్ట్స్ అన్నీ చూశాక కూడా, జూనియర్ డాక్టర్ కు అర్థం కాని కేసు, సీనియర్ కు పేషంట్ ని చూడగానే అర్థం అవుతుంది. అలాగే, వారందర్నీ చూశాక, సమస్య ఏమిటో, ఎక్కడ తప్పు జరిగిందో అతనికి అర్థం అయింది.

అందరూ దూరపు బంధువులే. అతని ఉద్యోగులు నిబంధనల ప్రకారం మాట్లాడేసరికి వారు బాధపడ్డారు. అతని మనుషుల కార్పొరేట్ వ్యవహారశైలికి నొచ్చుకుని సమస్యని మరింత బిగించారు. చదువులేని వారు, తెలివి లేని వారనుకోవడం తెలివితక్కువ.

అతని ఉద్యోగులా విషయంలో పొరపాటు పడ్డారు.

అతని రాకతో గ్రామస్థుల అహం తృప్తి పడింది. సగం గొడవ తీరినట్లైంది. సమస్య తీర్చడానికి అతనే స్వయంగా రావడం వారూహించలేదు. అతను కూడా వారి పట్ల వ్యతిరేకతను ప్రదర్శించలేదు. ఇరువురికీ సానుకూలంగా ఒక మార్గం సూచించాడు. అది అందరికి నచ్చింది. వివాదం త్వరగానే ముగిసింది.

వారంతా వాళ్ళ పిల్లల కోసం తనవద్ద ఉద్యోగాలిమ్మని అడుగుతారని ఆశించాడు. అడగనందుకు ఆశ్చర్యపడి, వాళ్ళ పిల్లలు ఏమి చేస్తున్నారో కనుక్కున్నాడు. అందరూ విదేశాల్లో స్థిరపడ్డారు. ఆ వివరాలు వారంతా గర్వంగా చెబుతుంటే , కొద్దిపాటి అసూయ కలిగింది, తన సహాయం ఆశిచించే స్థితిలో లేనందుకు! అయినా శ్రద్ధగా విన్నాడు. మెచ్చుకున్నాడు.

స్వయంగా అతనొస్తాడని, అంత సామరస్యంగా మాట్లాడతాడని వారూహించలేదు. వారికీ సంతోషం కలిగింది. అతని లాంటి గొప్పమనిషి తమమధ్య సామాన్యుడిలా కూర్చుని తమ బిడ్డల వివరాలు కనుక్కోవడం వాళ్లకు నచ్చింది. నాలుగవుతూ ఉంది.

మర్యాదలు చేయబోయారు. తినడానికి ఏవో తీసుకొచ్చారు. అతను భోజనం చేసి ప్రయాణమయానని, ఆకలిగా లేదనీ వద్దన్నాడు. నిజానికి భోజనం చేయకుండా వచ్చేశాడు.

బయటి పదార్థాలు తినాలంటే అతనికి భయం. కనీసం మంచినీరు తాగమని ,చల్లటి మంచినీళ్ళ బాటిల్ తెచ్చారు. దారిలో తాగుతానని జీప్ లో పెట్టాడు.

అహమోడి సాయంత్రమైంది. సాయంత్రం అవుతున్నాగానీ ఇంకా వెలుగు ఉంది.

వాతావరణం తేలికయ్యాక , అందరివద్దా సెలవు తీసుకుని ఇక వెళతానన్నాడు.

నది ఒడ్డుకు వచ్చేసరికి బల్లకట్టు కనిపించలేదు.

ఆ మనిషిని ఉండమని చెప్పాడా?

చెప్పలేదన్న విషయం గుర్తొచ్చింది.

అతనికి డబ్బుకూడా ఇవ్వలేదు. అతనూ అడగలేదు. వెళ్ళేటపుడు ఏదో ఏర్పాటు చేద్దామనుకున్నాడు.

జీప్ నదికి దగ్గరగా ఆపాడు. చుట్టూ ఎవరూ లేరు. వెనక్కి తిరిగి చూశాడు. తను వచ్చిన దారికూడా కనిపించనంత దట్టంగా ఉన్నాయి అడవి చెట్లు.

'ఎలా ఇపుడు?'

'వెళ్లాలి . వెళ్ళి తీరాలి!'

రేపు ఉదయానికి వస్తానని చెప్పాడు.

ఫోన్ తీశాడు. ఛార్జ్ లేదు. జీప్ లో చార్జింగ్ కు పెట్టాడు. చుట్టూ చూశాడు. ఎవరూ లేరు.

నది అవతలి ఒడ్డు వైపు చూశాడు. ఎటు చూసినా ఎవరూ వస్తున్న జాడ కనిపించలేదు.

ఒకవేళ బల్లకట్టు వాడు రాకపోతే, ఇంతేనా?

దూరంగా చిన్న ఇల్లొకటి కనిపిస్తోంది. ఇంత దూరంలో మనుషులెందుకుంటారు.

కోటలో ఉన్నపుడే రాజు. బయటకొచ్చాక కాదు అని స్ఫురించింది. చీకటి పడేలోపున బల్లకట్టు వస్తుందన్న నమ్మకంతో జీప్ కానుకుని నిలబడ్డాడు. నది ఆగకుండా నెమ్మదిగా ప్రవహిస్తూనే ఉంది. చూసి చూసి విసుగేసింది. జీప్ డోర్ తెరిచి, సీట్లో ఓ పక్కగా కూర్చున్నాడు. కాలి బూట్ల కింద అన్నీ ఎండుటాకులు. కదిల్తే చప్పుడు చేస్తున్నాయి. ఆకలి తెలుస్తోంది. వెనక్కి తిరిగి చూశాడు. పిల్ల ఇచ్చిన వేరుశనక్కాయలున్నాయి. అవి తీసుకుని లేచి, జీప్ తలుపు వేసేసి, దగ్గర్లో ఉన్న గుట్ట మీదకు నడిచాడు.

గుట్ట మీద అంతా రాతినేల. ఏవేవో చిన్ని చిన్ని చెట్లు.చిన్న సెలయేరు ప్రవహిస్తూ ఉంది. దిగువన ఉన్న నదిలో కలవడానికి ఆత్రంగా గలగలా నడిచిపోతోంది. నదికున్నంత నిమ్మళం లేదేమి?

పక్కనే ఉన్న రాతిమీద కూర్చుని, కాళ్లు సెలయేటిలో పెట్టాడు. నీళ్ళ ఒరిపిడికి కాబోలు, రాళ్ళకు గరుకుతనం లేదు. నునుపైన చిన్ని రాళ్లని చేత్తో తీసుకుని చూశాడు. వెచ్చని నీరు కాళ్లకు రాసుకుంటూ పోతోంది. హాయినిచ్చి, సేదతీరుస్తోంది.

కాసేపు కూర్చుని దిగి వస్తుంటే, గుట్ట పైనుండి దగ్గర్లో ఉన్న ఇల్లు కనిపిస్తోంది. ఎవరో వయసు మళ్లినావిడ ఇంటివెనకవైపు బట్టలు మడతలు పెడుతోంది.

బల్లకట్టు మనిషి ఎప్పుడొస్తాడో ఈవిడని అడగాలి అని త్వరగా గుట్ట దిగి వచ్చాడు.

ఆమె దడిముందు నిలబడి “ఎవరండీ ఇంట్లో?” అంటూ పిలిచాడు.

ఆవిడ బయటికి వచ్చింది.

అరవై, అరవై అయిదేళ్లుంటాయి. నలుపుబారిన చర్మం. సన్నగా పొడుగ్గా ఉంది. తెలుపు తగ్గిన చీర కట్టుకుంది. భుజం చుట్టూ కొంగు కప్పుకుంది. నల్లని చేతికో కడియం ఉంది. బంగారపుదేమోకానీ, రాగిరంగుకు మారిఉంది.

దూరంగా ఉన్న జీప్ ని చూపిస్తూ, “ఇందాక నేను ఊళ్లో కెళ్ళానండీ. మళ్ళీ వచ్చి చూస్తే బల్లకట్టు లేదు. అతనెప్పుడొస్తాడూ?”

ఆమె కూడా బయటి వరకూ వచ్చి చూసింది. “నారాయణా?” ఆకాశం వంక చూసింది. పిట్టలు, పక్షులు ఇళ్ళకెళుతున్నాయి.

"ఇక రాడేమోనండీ. మీకు వస్తానని చెప్పాడా? " అంది.

తను గొప్పవాడని తెలిసినందుకా? ఆమె తనను మీరు అంటోంది. ఏక వచనం వాడడం లేదు. ఆమె వయసుకు నువ్వు అన్నా సరే తప్పుగా ఉండదు. అయినా అనకపోవడం ఆశ్చర్యంగా ఉంది.

ఆమె వంక చూసి మెల్లగా "మళ్ళీ వస్తానన్నాను. " అన్నాడు గొంతు తక్కువ చేసి.

“ఉండండి. ఫోన్ చేద్దాం.” అంటూ లోపలికి వెళ్ళింది.

ఈ వయసువారిని నడవలేని వాళ్లలా చూపిస్తుంటారేమిటో. ఆవిడ వంగిపోకుండా, నిటారుగా, నడుస్తోంది. ఇలా వంటరిగా ఉందేమిటిక్కడ? ఈమెకు తోడెవరు?

వసారా మధ్యలో అయిదారు మెట్లున్నాయి. అతనుకూడా ఆ మెట్లెక్కి గుమ్మం దగ్గర నిలబడ్డాడు. లోపల ఒకటే పెద్దగది. ఏవేవో సామాన్లున్నాయి. రెండు మూడు అలమార్లున్నాయి.

ఒక గోడకమర్చిన చిన్న చెక్కమీద నల్లటి ఫోన్ ఉంది. దానికింద చిన్న పుస్తకం తీసి , ఒక నంబర్ నొక్కింది.

"నారాయణా, నేను" అంది.

ఫోన్లో ఆమె గొంతు పరిచయమే కాబోలు ఏవో మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఇక్కడ, బాబుగారిని వదిలి వెళ్ళావుకదా. ఆయన నీకోసం ఎదురు చూస్తున్నారు."

అవతలి మాటలేమిటో శ్రద్ధగా వినడానికి తలపక్కగా వంచి, కళ్ళు చిట్లించి, ప్రయత్నించాడు.

అవతలి వైపు మాటలు విన్నాక , ఆమె ఫోన్ పెట్టేసింది.

వరండాలోకి వచ్చి, "నారాయణకేదో అవసరమైన పని తగిలిందటండీ, రేపుదయమే వస్తానని మీతో చెప్పమన్నాడు"

ఇలా అవుతుందని అనుకోలేదే?

ఎలా ఇప్పుడు!

“మరి నేను వెళ్ళాలి.” ఆమెతో ఫిర్యాదు చేస్తున్నట్టు అన్నాడు.

“అవును మరి. మీకెన్నో అవసరమైన పనులుంటాయి.” ఆమె ఒప్పుకున్నట్లు అంది.

“నారాయణ కు మళ్ళీ చేస్తానుండండి.” అంటూ హడావుడిగా కదిలి లోపలికి వెళ్ళబోయింది. ఆమెను కంగారు పెడుతున్నందుకు మొహమాట పడ్డాడు.

అలా అని ఆమెను ఆపదలచుకోలేదు. తను వెళ్లాలి, ఇక్కడెక్కడ ఉంటాడు. ఈమె తప్ప ఇంకెవరూ సహాయం చెయ్యలేరు.

ఆమెను లోపలికి వెళ్ళనిచ్చి ఆత్రుతగా ఎదురు చూశాడు.

లోపలికి వెళ్లి మళ్ళీ వచ్చింది.

“నారాయణ బయటికెళ్ళినట్టున్నాడండీ. ఫోన్ తియ్యడం లేదు.” అని.

మౌనంగా నిలబడ్డాడు.

“నారాయణ ఇలా చేసినందుకు నాకూ ఇదిగానే ఉంది” అంటూ నొచ్చుకుంది. “ఇయ్యాల్టికి ఉండిపొండి. ఉదయాన్నే వెళ్దురుగానీ.”

మెల్లగా తలూపాడు. ‘తప్పదుకదా. జీప్ లో పడుకోవాలి ఈ రాత్రికి’ అనుకుంటూ కదిలాడు.

వెనక్కి తిరిగి జీప్ దగ్గరకు వచ్చాడు. నదికి ఆనుకుని, ఎత్తైన చెట్టొకటుంది. దళసరి ఆకుల చెట్టు. కొన్న పండుటాకుల్ని రాల్చింది. నదిలో లోకి వంగి నీళ్ళని అందుకోడానికి ప్రయత్నిస్తోంది. గాలికి ఎంతో ఉత్సాహపడుతోంది. దాని కొమ్మలనుండి చిక్కటి లతలు జారుతూ నీళ్ళలో పడుతున్నాయి. నదీ ప్రవాహంతో పాటు ప్రయాణించడానికి నిత్యం ప్రయత్నిస్తున్నాయి. లతల్ని తన ప్రవాహంలోకి ఆహ్వానిస్తున్న చోట నదిలో చిన్న చిన్న సుడిగుండాలు ఏర్పడుతున్నాయి.

చిన్న రంగు రంగుల పిట్ట ఒకటి, ఒడ్డు మీద పచ్చికలో నెమ్మదిగా అడుగులేస్తూ కొద్దిగా తలవంచి నదిలోకి చూస్తోంది. పరసరాలు చూస్తుంటే పరుగు తీయాలన్న తొందర ఎవరికీ ఉన్నట్టు లేదు. అన్నిటిలోనూ ఏదో ఉత్సాహం తప్ప.

రేపటి మీటింగ్స్ గుర్తొచ్చాయి.

'తను లేకపోయినా అయిపోతాయి, కనీసం స్టాఫ్ ఒక నాడైనా ఊపిరి పీల్చుకుంటారు.' అనుకున్నాడు.

ఎండుటాకుల చప్పుడు వినిపిస్తే , అటు చూశాడు. ఆవిడ తనవేపే వస్తోంది. ఎందుకొస్తోందో తనవైపు అనుకుంటూ చూశాడు. దగ్గరకొచ్చాక చూస్తే ఆమె చేతిలో చిన్న ఇత్తడి పళ్ళెం. పళ్ళెంలో అడుగున బాదం ఆకులున్నాయి. గారెలు తెచ్చింది.

“తీసుకోండి.” అంది.

‘వద్దండీ’ అనలేకపోయాడు. ‘థాంక్స్’ అనడం అసందర్భంగా ఉంటుందనిపించింది.

మాట్లాడకుండా తీసుకున్నాడు. ప్లేట్ అతని చేతికిచ్చి ఆమె వెళ్ళిపోతోంది.

గారెలు పట్టుకోగానే చేతులు కాలాయి. చేతుల్తో ఏదైనా తిని ఎన్నేళ్ళయింది.

జీప్ లో ఉన్న టిస్యూ పేపర్ బాక్స్ నుండి కొన్ని పేపర్లు లాగి, వాటితో గారెలు ఒకటొకటే తిన్నాడు. గారెల్లో అల్లం వేస్తే ఇంత రుచి వస్తుందా ?

ఖాళీ ప్లేట్ పట్టుకుని ఆమె ఇంటి వైపు నడిచాడు.

ఆవిడే ఎదురొస్తోంది. చిన్న ఇత్తడి గ్లాసుతో.

అతని చేతిలో పళ్ళెం తీసుకుని చేతికి ఇత్తడి గ్లాసు ఇచ్చింది. వేడి పట్టడం చేతులకు కష్టంగా ఉంది. గ్లాసు అంచులు వేళ్ళతో జాగ్రత్తగా పట్టుకున్నాడు.

తాగినంత సేపూ , ఆమె అక్కడే ఉంది.

“రేపుదయమే వెళ్ళి పోదురుగాని. ఈ రాత్రికి ఉండిపొండి. పెందరాళే రమ్మని నేను మళ్ళీ ఫోన్ చేస్తాను నారాయణకు.” నచ్చజెప్తున్నట్టు అంది.

“చీకటి పడొస్తుంది కదా. సుడిగుండాలు కనపడవు. బల్లకట్టు మీద అంత మంచిదీ కాదు.” ఆమె మాటలకు తలూపాడు.

అతను తాగిన గ్లాస్ తీసుకుని “స్నానం చేసి రండి.” అంటూ వెళ్ళింది.

జీప్ లో ఎప్పుడూ తన సిబ్బంది ట్రావెల్ బాగ్ ఒకటి ఉంచుతారు. దాన్ని తీశాడు.

ప్రతిరోజూ స్నానానికి అతను అయిదు నిముషాలకన్నా ఎక్కువ ఖర్చు చెయ్యడు. స్విమ్మింగ్ పూల్ కట్టించాడు కానీ , ఇంటికి అలంకారమే.

నదిలోకి దిగాడు. నదిలోని నీళ్ళు వెచ్చగా తనని దాటి వెళ్ళిపోతున్నాయి. ఎప్పటికప్పుడు కొత్తనీరు వచ్చి ‘బాగున్నావా , బాగున్నావా’ అంటోంది. వళ్ళంతా తడిమి తడిమి పలకరిస్తోంది.

నదిలో నీరు చల్లగానూ, వేడిగానూ లేదు. ఈతకొట్టినకొద్దీ హాయిగా ఉంది.

నీటితో ఎంత సేపు స్నేహం చేసినా, ఎంత సేపు స్నానం చేసినా తనివి తీరడం లేదు. ఏన్నో ఏళ్ల తర్వాత చూసిన ప్రేయిసిలా వదలకుండా కౌగలించుకుని నులివెచ్చగా పరామర్శిస్తోంది. అతనిక్కూడా వదిలించుకోవడమెలాగో తెలియడం లేదు.

‘ఎలా ఇలా అయితే?’

‘వదలకపోతే ఎలా?’

‘వదులూ, నేను పోవాలి.’ అని మన్నింపుకోరి బయటికి వచ్చాడు. నది కినుక వహించిందేమోనన్న అనుమానం వచ్చి వొడ్డున నిలబడి పరీక్షగా చూశాడు.

అదే నెమ్మది. అదే ఉత్సాహం. అదే ప్రవాహం.

ఆ గమనంలో తేడా లేదు.

ఆమె ఇంటి వైపు నడుస్తుండగా అప్పుడే చంద్రోదయం అవుతోంది.

ఇంటిముందు ఒక తులసికోటలో నిండుగా పెరిగిన కృష్ణ తులసి ఉంది. కోట చుట్టూ పచ్చని చేమంతులు, నారింజ రంగు బంతిపూలు విరబూశాయి. దృశ్యం చూస్తే వెన్నెల్లో వారికి ట్యూషన్ జరుగుతున్నట్టుంది.

లోపలికెళ్ళి చూశాడు. అతనొచ్చిన అలికిడి విని ‘రండి, రండి’ అంటూ ఒక పేము కుర్చీ తుడిచి కూర్చోమని చెప్పింది. ఓ పక్కగా వంట చేసుకునే ఏర్పాటుంది. ఓ మూల నల్లని చిన్న రోలున్నది. దాని పక్కనే , కోనుగా ఉన్న రాతి పాత్రం.

ఒకటే పెద్దగది. ఏవేవో సామాన్లు ఉన్నాయి. ఆమెకో టీవీ ఉంది.

“ఊళ్ళో వుండకుండా ఇలా విడిగా ఉన్నారే?” అడిగాడు.

“అప్పట్లో ఊళ్లో అంతా గొడవలుగా ఉండేది. మాస్టారికి పిల్లలకు చదువు చెప్పడానికిక్కడే బాగుందని, ఇల్లు ఇక్కడే కట్టారు.” మాస్టారంటే ఆమె భర్త కాబోలు.

“మీకు, ఎవరు ఇక్కడ తోడు?” కూడబలుకుతున్నట్టు అడిగాడు.

“అబ్బాయున్నాడండీ. అన్నీ చూసుకుంటాడు.”

అబ్బాయి ఎక్కడ ఉంటాడో? ఏడీ ?

"అబ్బాయికి తీరిక ఉండదండీ. తినే వ్యవధి ఉండదు. వీలున్నపుడు వస్తుంటాడు."

యాస పల్లెటూరిదైనా, మధ్య మధ్యలో ఆమె ఉపయోగించే పదాలు అతనెప్పుడూ మామూలు సంభాషణలో వినలేదు.

ఆమె ఎవరో తెలియదు. తనిక్కడ ఉండడమేమిటో,

ఒక్క రాత్రికి నసపెట్టకు అని మనసుని కసురుకున్నాడు.

ఆమె వంట ఏర్పాట్లు చేస్తోంది.

"అవేమి వద్దమ్మా. రాత్రిపెద్దగా తినే అలవాటు లేదు."

"అదేమిటండీ. మీరొచ్చారని నేనెంతో ఇదిగా అనుకుంటుంటే!" గొణుకున్నట్టు అన్నది. ఆవిడ ఎక్కువ మాట్లాడే మనిషిలా లేదు.

"మీకు శ్రమ ఎందుకనీ?" అన్నాడు

"అలా అనుకోకండి. వెనక్కి ఊళ్ళో కెళ్ళినా, మీరొకరి ఇంట్లో ఉండవలసిందేకదా. మా ఇంట్లోనే ఉండండి. సదుపాయాల్లేవనే నా ఇది."

టీవీ పెట్టింది. కావాలంటే మార్చుకొండి అని రిమోట్ అతని చేతికిచ్చింది.

టీవీ లో పాత సినిమాలో పాట వస్తోంది.

'అనురాగము విరిసేనా, ఓ రేరాజా!

అనుతాపము తీరేనా

వినువీధినేలే రాజువే..

నిరుపేద చెలిపై మనసౌనా.'

అంటూ జమున ఒక పూల తీగె పక్కన నిలబడి అమాయకంగా అడుగుతోంది.

చిన్న గా శబ్దం వినిపిస్తే చూశాడు. చిన్న రోలులో ఆమె పచ్చడి నూరుతోంది. ఆ ఘుమఘుమలకు ఆకలి రాజుకుంటోంది. పక్కనే ఉన్న కుంపటి మీద చిన్న బాండీలో తాలింపు సిద్ధం చేసి , అది రోట్లో ఉన్న పచ్చడికి కలిపింది. అదంతా ఒక గిన్నెలోకి తీసింది.

వంట అయిపోయినట్లుంది. వడ్డించడానికి సిద్ధం చేస్తోంది.

ఈవిడే తనింటికొస్తే కనీసం మంచినీళ్ళివ్వగలుగుతాడా?

తనవరకూ రానిస్తారా తన సిబ్బంది?

పేము కుర్చీ ఎదురుగా చిన్న బల్ల తెచ్చి వేసింది.

"పళ్ళెం ఉంది కానీ , మీకు చిన్నదవుతుందనీ!" సంజాయిషీ ఇస్తూ బల్లమీద , బాదం ఆకులతో చేసిన విసరి పెట్టింది. ఒకదానికొకటి తోడుగా రెండు విస్తర్లు వేసింది. డబ్బా మూత తెరిచి, ఒక లడ్డు పెట్టింది.

వేడి అన్నం వడ్డించగానే ఆకు రంగుమారింది. అన్నం ముట్టుకోవడానికి రెండు నిముషాలు పట్టింది. అన్నం మీద నెయ్యిపోసింది. ఇందాకటి పచ్చడి వేసింది.

నెలకోసారి అన్నం తింటాడు. ఏదైనా పార్టీకెళ్ళినపుడు, తప్పని సరైనపుడు మాత్రమే. అది కూడా చల్లారిన అన్నం తినడమే అలవాటు. కానీ ఇంతవేడి , అదీ చేతులతో తినడం అలవాటే పోయింది.

"పాతకాలం వాళ్ళం సాంబారులవీ రావు. పెసర పప్పుచారు చేశాను. బాగుంటుంది." అంటూ, వేడి అన్నంలో పొగలొస్తున్న పప్పుచారుపోసింది.

"నెయ్యి పడితేనే రుచి" అంటూ వొంపేసింది వద్దు వద్దు అంటున్నా.

అప్పటికే వేడి అన్నం  పచ్చడి ఘాటు! చెయ్యి తట్టుకోలేక పోతోంది.

ఇప్పుడి అగ్నిగుండంలో చెయ్యి పెట్టేదెలా అని ఆలోచిస్తూ దానివంకే చూస్తూ ఉన్నాడు.  లోపల్నుండి నిప్పులపై కాల్చిన అప్పడం పట్టకారుతో తెచ్చి విస్తరిలో, పక్కనే పెట్టింది.

ఏదైనా సరే ఊదుకుంటూ తినవలసి వస్తోంది. చల్లగాలి వీస్తున్నాగానీ, భోజనం తినడానికి అవస్థ పడుతున్నాడు.

చివరగా చిన్న ఎఱ్ఱటి మట్టి పిడతతో తోడుబెట్టిన పెరుగు తెచ్చింది. మొత్తం అతని విస్తరిలో వడ్డించింది.

"మరి మీకో?"

వేరే వారి సౌకర్యాలు కనుక్కోవడం అతనికి అలవాటులేని పని.

"నేను పెరుగు వాడనండీ. రేపటి మజ్జిగకోసం తోడుబెట్టాను. మంచిదైంది. మీరొచ్చారు."

చల్లని వెన్నల, బాదం ఆకు విస్తరి, ఆ పరిసరాలు , ఆ వేడి, రుచి,  పరిచయం లేని ఆవిడ ఆతిథ్యం ఆ అనుభవం అంతా కొంతగా ఉంది.

ఆమె తనని మీరు అని మన్నించడం , వినడానికి కష్టంగా ఉంది. అది వద్దని ఎలా చెప్పాలో తెలియలేదు. ఏదైనా బయటకి చెప్పబోతే ఏ మాట తెచ్చిపెట్టుకున్నట్లనిపిస్తోంది.

"ఎక్కువ తినేశాను  ఇవాళ." అన్నాడు.

"చిన్న పిల్లాడిలా తిన్నారు. ఇదా ఎక్కువ?" నవ్వింది.

ఒక ఇత్తడి చెంబుతో నీళ్ళు ఇచ్చి,  "ఆ చెట్టు మొదట్లో చెయ్యి కడుక్కోండి" అంది.

అతను మెట్లు దిగి వెళ్ళి , చెయ్యి శుభ్రం చేసుకుని వచ్చేసరికి తను తిన్న విస్తరి , బల్లా రెండూ లేవు.

నొచ్చుకున్నాడు.

"అదేంటి అలా చేశారూ?"  పెద్దవారితో మసలడం తెలియనందుకు తనమీద తనకే చిరాకు వచ్చింది.

తీసుకోవడం ఎప్పుడూ భారమే.

"మీరు భోం చేశారా?" అడిగాడు.

"రాత్రుళ్ళు తిననండీ. ఈ వయసుకు ఒక పండు తింటేనే ఎక్కువ."

ఆమె ముఖంలో సంతోషము లేదు విచారమూ లేదు.

ఆమెకు జీవనమెలాగో?

"ఇక్కడ మీకెవరు , ఎలా?"

మీటింగ్స్ లో మాట్లాడినంత సులభం కాదు, మనుషులతో మాట్లాడడం.

"అబ్బాయి అన్నీ చూస్తాడండీ."

తోడులేకుండా ఎలా ఉంటోంది.

" ఫోను పెట్టించాడు. వీలున్నపుడల్లా వస్తుంటాడు. సర్వం పంపిస్తాడు."

అన్నీ ఏర్పాటు చేస్తే సరిపోయిందా?

"రమ్మంటాడు కానీ, ఇల్లూ వాకిలీ వదిలేసి వెళ్లాలంటే , అయ్యే పనేనా?"

"అర్ధ రాత్రి ఏదైనా అవసరమొస్తే ఎలా?"

"నారాయణ అన్నీ తెచ్చిపెడతాడండీ. అన్నీ అవసరానికి మించే ఉన్నాయి, వయసుతో సహా."

మనసు చివుక్కుమంది.

బయటికి వచ్చి , వరండాలో నిలబడి నదివంక చూస్తూ ఉన్నాడు.

అతనికి బయట వసారాలో మంచం వాల్చి, ఆకుపచ్చ గళ్ళ దుప్పటి పరచింది. ఆకుపచ్చని గళ్ల దుప్పటి పరచింది. దిండు వేసి పడుకోండి అంది. పడుకున్నాడు. తమ ఇంటి బెడ్ రూం లో మెత్తటి పరుపులు , నునుపైన సాటిన్ దుప్పటి గుర్తొచ్చింది. గళ్ళ దుప్పటి గరుకుదనం హాయిగా ఉంది.

కప్పుకోవడానికి తీసుకోండి. అంటూ వేరే శాలువా లాంటిది ఇచ్చింది.

వేరే వైపు ఆమె పడుకుని, ఏవో తత్వాలు పాడుకుంటోంది.

నల్లని సరుగుడు చెట్లు వరుసగా నిలబడి గుస గుసలాడుతున్నాయి. ఆకాశం వంక చూసి ఎన్నాళ్ళైంది. అతను పడుకున్న చోటు నుండి నది కనిపిస్తోంది. వెన్నెల్లో తళతళా మెరుస్తూ స్థిరంగా ప్రవహిస్తూనే ఉంది. కొంత సేపు విశ్రాంతి తీసుకోవచ్చుకదా.

సరిగా చూద్దామని లేచి కూర్చుని చూస్తున్నాడు. అలాంటి దృశ్యాన్ని ఎక్కడా చూడలేదు. ప్రకృతి ఎందుకింత మనోహరంగా ఉందీ. ఆ అందమంతా ఏం చేసుకోవాలి . తికమకగా ఉంది.

నిద్రపోవాలి ఈ టైం కు అని శరీరం గుర్తుచేసింది.

ఇంత అందం ఎదురుగా ఉంటే నిద్రపోవడం ఎలా?

"నిద్ర పట్టడం లేదా బాబూ?"

ఇదివరకులా, ఆమె గొంతులో మన్నింపు లేదు. దయగా ఉంది. రంగడి మీద వరుసలేవో అందుకుంది. శ్రావ్యమైన గొంతేమీ కాదు. నాగరికతకు పాకులాడని కరుకుదనం ఉంది. అయితేనేమి మెత్తగా జోలపాడినట్లే ఉంది. మనసు మీద వెన్నతో రాస్తున్నట్టే ఉంది.

తెలతెలవారుతోంది. పక్షులు అల్లరి చేస్తున్నాయి. లేచి కూర్చున్నాడు.

ఆవిడ నిద్రపోతోంది.

నవారు మంచం పైన దళసరి గళ్ళ దుప్పటి. తడిమి చూశాడు. ఎంత సుఖమైన నిద్ర. మళ్ళీ జీవితంలో ఇలాంటి రాత్రి ఒకటి వస్తుందా?

తను కప్పుకున్న శాలువా దుప్పటిని మెత్తగా మడత పెట్టి దిండు మీద పెట్టాడు.

నెమ్మదిగా ఇంటి మెట్లు దిగి, వెళ్ళాడు. ఆమెకు నిద్ర పాడవుతుందని మెల్లగా నడిచాడు. నది పక్కన కొద్దిసేపు నిలబడ్డాడు. మనసంతా తృప్తితో నిండింది. ప్రతి ఉదయమూ ఉండే, పని తాలూకు వత్తిడి లేదు. పరుగు తీద్దామన్న అశాంతి లేదు.

నిశ్చలమైన సరస్సు పక్కన , ప్రకృతి తనని సన్మానిస్తుంటే, ఆనందంగా నిలబడినట్లుంది.

తర్వాత జీప్ లో ఉన్న ట్రావెల్ బాగ్ తీసి తయారయ్యాడు.

అది జాగింగ్ చేసే టైం అతనికి. అడవి లోపలికి కొంత దూరం నడక సాగించాడు.

ఒక బలమైన చెట్టు వద్ద ఆగి చూశాడు. ఎన్నో అందమైన లతలు , తీగెలు, ఆ కాండం చుట్టూ అల్లుకుని ఉన్నాయి. తల ఎత్తి పైకి చూశాడు. మెడ నొప్పిగా అనిపించి తలదించుకున్నాడు. అదొక్కటే కాదు. చుట్టూ ఉన్న చెట్లన్నీ అలానే ఎత్తుగా ఉన్నాయి.

బిజినెస్ ప్రత్యర్థులు ఒకరొకరే గుర్తొచ్చారు. ఎవరూ తక్కువ వాళ్ళు కాదు. ప్రతివారిలోని గొప్పతనం గుర్తు చేసుకున్నాడు. ఎంతటి సమర్థులు!

ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలోని అడిగిన ప్రశ్న ఒకటి గుర్తొచ్చింది. మీ ప్రత్యర్థుల్లో మీకు నచ్చిన గుణం, మీకు లేనిదీ, ఒకటి చెప్పమని చిరునవ్వుతో కోరింది, ఇంటర్వ్యూ చేసే యువతి. ఆనాడు ఆమె చిరునవ్వు విసుగు తెప్పించింది.

ఈ ప్రశ్న తీసెయ్యమని కోరాడు. ఆ ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పి ఉంటే, ఎంత సంపూర్ణంగా ఉండేది ఇంటర్వ్యూ. ఆ ప్రశ్నకు జవాబు చెప్పాలనిపిస్తోంది. టీవీ చానల్ వారికి ఫోన్ చేసి , 'షూటింగ్ ఏర్పాటు చెయ్యమని అడగాలి.' అనుకున్నాడు.

ఒక్కసారిగా గుండెలో ఆనందపు జలపాతం దూకినట్లనిపించింది. చేతికందిన కర్రపుల్లనొక దాన్ని తీసుకుని దానితో ఆడుతూ బాట వెంట నడుస్తున్నాడు.

మరీ ఏటవాలుగా లేని గుట్ట మీద కొంత పచ్చిక మొలిచింది. దానిమీద కూర్చున్నాడు. మెత్తగా ఉంది. పడుకుని ఆకాశం వంక చూశాడు. మేఘాల్లో కొన్ని ఆకారాలను ఊహించాడు. చల్లగాలికి నిద్రవస్తోంది. నిద్రపోతే అనుకుని, లేచి, మళ్ళీ అడవి లోపలికి వెళ్ళాడు.

ఓ చోట, బాట కిరువైపుల తీగెల చెట్లు , చేతులు పట్టుకున్నట్టు, స్నేహంగా పందిరి వేశాయి. లతలన్నీ, చిన్ని చిన్ని పసుపు పచ్చని పూలతో వేళాడుతున్నాయి. ఒక బలమైన తీగెను పట్టుకుని ఊపాడు. పూలన్నీ , తలంబ్రాలవలె జలజలా రాలాయి.

మరోచోట దారికడ్డం వచ్చిందొక పూలకొమ్మ. కొమ్మనిండా పూసిన తెల్ల పూలు. మల్లెలంత చిన్నగా లేవు. నందివర్ధనాలంత పెద్దగానూ లేవు. గులాబిల్లా, సుకుమారంగానూ గానూ లేవు. ఆకులు కనబడడం లేదు. పెద్ద చెట్టు దగ్గర ఆగిపోతున్నాడు. చిన్న పూలకొమ్మ దగ్గరా ఆగిపోవాలనిపిస్తోంది. ఎలా ఇలా అయితే.

"నేను పోవాలి కదా" అన్నాడు.

చల్లగాలి రివ్వున వీచింది. తెల్లపూలు విసురున వచ్చి వర్షపు జల్లులా ముఖానికి తాకాయి.

'వెళ్తానంటే నేకాదన్నానా?' అంటూ కొమ్మ నవ్వినట్లనిపించింది.

మెల్లగా సాగిపోతున్నాడు. మనసంతా ఆ పూల కొమ్మ మీదే ఉంది. ఎంత అందం. ఎంత చక్కని పరిమళం. ఒక అడవిలో అనామకంగా ఉన్నా ఎంత సంతోషంగా ఉంది.

ఎందుకా సంతోషం , ఏమి సాధించిందని.

ఏదో సాధించితేనే సంతోషం అని తెలియకపోవడమే వాటి సంతోషం.

ఎవరో సాధిస్తే, అసూయ తెలియకపోవడమే సంతోషం.

గమనమే లక్ష్యమైన సంతోషం.

వెనక్కి తిరిగి వెళ్ళి మెల్లగా ఆ కొమ్మను ముద్దాడాడు. తన పని తనకే విచిత్రమనిపించింది.

ఏమవుతోంది తనకు. 'ఇక్కడినుండి వెళ్లాలి' అనుకుంటూ వడివడిగా తిరిగి నది దగ్గరకొచ్చేశాడు.

దూరంగా బల్లకట్టు వస్తోంది. త్వరగా నది ఒడ్డుకి వెళ్లి చెయ్యూపాడు. క్రితం రోజు, తనను దింపిన బల్లకట్టు అబ్బాయి, పరుగున వచ్చి , అతన్ని చేరుకున్నాడు.

దగ్గరకొచ్చి "నమస్తే సార్ , రాత్రి, పిల్లదాని వొళ్ళు వెచ్చబడింది. హాస్పిటల్లో చేర్చాము. మీకిబ్బందైంది. మామ్మగారు ఫోన్ చేశారన్నాడు."

“వెళ్దామా. ఒక్క సారి ఆవిడతో చెప్పి వస్తాను.” అంటూ ఆమె ఇంటివైపెళ్లాడు.

నేనూ వస్తాను పదండంటూ నారాయణ కూడా వెంట వచ్చాడు.

“నేను మాస్టర్ గారిదగ్గరే చదువుకున్నానండీ.” అని చెప్తున్నాడతను . రెండు నిముషాల్లో కంది పుల్లల దడి దగ్గరకొచ్చేసరికి ఆమె ఇంకా మంచం మీద నిద్రపోతూనే ఇంది.

‘తనవల్ల ఆమెకు రాత్రి పనెక్కువై అలిసిపోయింది.’ అనుకున్నాడు.

దూరంగా ఆవిడ ఇంకా పడుకునే ఉండడం నారాయణకు అనుమానం వచ్చి, “మామ్మ ఇంతసేపు పడుకోదూ” అంటూ పరుగున వెళ్లి దడి తలుపు తీశాడు. ఒక్క అంగలో వసారా మెట్లెక్కి, “మామ్మా, మామ్మా” అంటూ పిలిచాడు.

తలెత్తి, "సార్, రండి" అంటూ పిలిచాడు.

వెంటనే వెళ్ళి ఆమె పడుకున్న వైపు వెళ్లి చూశాడు. ఒక పక్కకు తిరిగి అచేతనంగా పడుకుని ఉంది. గాజు కళ్ళ తో ఎక్కడో శున్యంలోకి చూస్తోంది.

ఆమె కనురెప్పలు మూసేశాడు.

అరగంటలోనే ఊరంతా తరలి వచ్చింది. ఏమిటేమిటో చర్చలు జరుగుతున్నాయి.

ఇంటి వెనక్కి వెళ్ళి చూశాడు. నిండైన పారిజాతం చెట్టొకటి, నేల మీద పూల జల్లు కురిపించింది.  ఓ పక్కన రాత్రి తను భోజనం చేసిన విస్తరి పద్ధతిగా మడత పెట్టి ఉన్నది.

"రాత్రి ఏమైనా చెప్పిందా?" ఊరివాళ్లడిగారు.

జరిగింది చెప్పాడు.

భోజనం పెట్టింది.

తనకు జోలపాడింది.

ఆమే నిద్రపోయింది.

“వాళ్లబ్బాయికి ఫోన్ చెయ్యొచ్చు కదా!” అని అడిగాడు ఎవరినో.

నారాయణ చెప్తున్నాడు. “అబ్బాయి అమెరికాలో ఉండేవాడు. ఆర్నెల్ల క్రితమే యాక్సిడెంట్ లో పోయాడు.  ఆ విషయం మామ్మకు చెప్పకుండా నడుపుకొస్తన్నాము. కొడుక్కి సెలవ దొరకదనీ, అతనొచ్చినపుడే పోతానని అంటుండేది. ”

ఊరి వాళ్లంతా చర్చించుకుంటున్నారు. ఎలా జరపాలి, ఎవరు జరపాలి అని.

ఆఖరి ఆతిథ్యం దక్కించుకున్న అదృష్టవంతుడు తనే!

సిబ్బందిలో ముఖ్యమైన వ్యక్తికి ఫోన్ చేశాడు.

"సార్, ఇంకా మూడు గంటల్లో ముఖ్యమైన మీటింగ్ ఉంది."  ఆ వ్యక్తి ఎవరో, అతనితో అపాయింట్మెంట్ ఎంత కష్ట పడి సాధించాడో, వివరంగా చెప్తున్నాడు అవతలి వ్యక్తి.

"శాంతినాథ్. అది కాన్సిల్ చెయ్యి. అదేకాదు. ఒక మూడు రోజుల పాటు అన్నీ కాన్సిల్ చెయ్యి. నా అసిస్టెంట్ ని ఇక్కడికి పంపించు! త్వరగా!"

***(వచ్చే నెల మరో కథతో కలుసుకుందాం)***

Post your comments